బాబూ.. మరచితా...?

- నిరుద్యోగ భృతి కోసం ఎదురు చూస్తున్న యువత
- తక్షణం అమలు జరిగేలా చూడాలని డిమాండ్



యువతకు ఉపాధి అవకాశాలు, నిరుద్యోగ భృతి కల్పిస్తామని కూటమి నాయకులు ప్రకటించిన మేనిఫెస్టో

డాబాగార్డెన్స్/అల్లిపురం/జగదాంబ: కూటమి ప్రభుత్వం తన ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన నిరుద్యోగ భృతి కోసం యువత వెయ్యి కళ్లతో ఎదురు చూస్తోంది. ప్రభుత్వం ఏర్పడి దాదాపు 40 రోజులు కావస్తోంది. కానీ నిరుద్యోగ భృతికి సంబంధించి ఇప్పటి వరకు ఎటువంటి ప్రకటన చేయలేదు. చంద్రబాబునాయుడు గతంలో నిరుద్యోగ భృతి రూ.2 వేలు ఇస్తానని చెప్పి ఆ మాటను గాలికొదిలేశారు. ఇప్పుడు కూడా నిరుద్యోగులకు ఇంటికో ఉద్యోగం ఇస్తామని.. అలా కాకపోతే భృతి అందజేస్తామని ప్రకటించారు. ఇది నమ్మిన నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో చంద్రబాబు నాయుడు అండ్ కోకు గంపగుత్తగా ఓట్లేశారు. అయితే చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడి ఇన్ని రోజులు కావస్తున్నా ఆయన చెప్పినట్లు పెద్ద ఎత్తున ఉద్యోగాల కల్పన గానీ.. నిరుద్యోగ భృతి అందజేయటం కానీ జరగలేదు. దీంతో నిరుద్యోగులు ఆందోళనలో పడ్డారు. బాబు చెప్పినట్లు చేస్తారా.. లేక ఊకదంపుడు మాటలేనా? అనుకుంటున్నారు. ఇప్పటికైనా నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలని.. లేకపోతే భృతి అయినా ఇవ్వాలని యువత డిమాండ్ చేస్తున్నారు. దీనిపై విధివిధానాలు ప్రకటించాలని కూడా వారు కోరుతున్నారు.

మార్గదర్శకాలు విడుదల చేయాలి..



నిరుద్యోగ భృతి కోసం ఎదురు చూస్తున్నాను. కూటమి ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు దాటిపోయింది. కాని ఇప్పటికీ నిరుద్యోగ భృతికి సంబంధించి ఎటువంటి మార్గదర్శకాలు విడుదల చేయలేదు. ఎలా దరఖాస్తు చేసుకోవాలో తెలియటం లేదు. 2014లో టీడీపీ ప్రభుత్వం నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి ఐదేళ్లు గడిపేసింది. ఇప్పుడు కూడా అలాగే జరుగుతుందని భావిస్తున్నాం. ఇప్పటికే 31 సంవత్సరాలు వచ్చేసాయి. ఉపాధి కల్పిన లేదు. ఇప్పటికైనా భృతిపై మార్గదర్శకాలు విడుదల చేసి మాలాంటి యువతకు ఒక దారి చూపాలి. – పాల దామోదరరెడ్డి, మెయిన్‌రోడ్డు, అల్లిపురం

భృతి ఎప్పుడొస్తుందో తెలియటంలేదు..



నేను డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగం కోసం చూస్తున్నాను. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ భృతి ప్రకటించింది. ఎన్నికల మేనిఫెస్టోలో ఆ విషయం పేర్కొంది. కానీ ప్రభుత్వం ఏర్పాటై 40 రోజులు కావస్తుంది. ఇప్పటి వరకు మార్గదర్శకాలు విడుదల చేయలేదు. సోషల్ మీడియాలో వస్తున్న మార్గదర్శకాలు చూసి ఆందోళన కలుగుతోంది. వారు పెట్టిన మార్గదర్శకాలు చూస్తుంటే నిరుద్యోగ భృతి వస్తుందో రాదో అర్థం కావటం లేదు. అవి ఎంత వరకు వాస్తవాలో తెలియటం లేదు.
– రెయ్య హర్షవర్ధన్ రెడ్డి, వెంకటేశ్వరమెట్ట

బాబూ.. ఇచ్చిన మాట నిలబెట్టుకో..



గతంలో మీ ప్రభుత్వం ఉన్నప్పుడు నిరుద్యోగ భృతి ప్రకటించారు. ఒక్కరికైనా ఇచ్చిన దాఖలాల్లేవ్. ఇప్పుడు మీరు ప్రకటించిన మేనిఫెస్టోలో మరలా అదే అంశాన్ని పొందుపరిచారు. ఉద్యోగం మాట ఎలా ఉన్నా.. కనీసం నిరుద్యోగ భృతి అయినా ఇస్తే పోటీ పరీక్షలకైనా సిద్ధపడతాం. పోటీ పరీక్షల కోసం కోచింగ్ సెంటర్లకు వెళ్లి చదివే స్తోమత లేదు. ప్రైవేట్‌గా ఉద్యోగం చేసుకుంటూ పోటీ పరీక్షలకు ఇంటి వద్దనే ప్రిపేరవుతున్నా. బాబు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని ఎంతో మంది నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారు.
– వర్రి నాగ అరుణ్‌కుమార్, మహారాణిపేట

వాగ్దానం అమలు చేయాలి..



కూటమి ప్రభుత్వం ఏర్పడి సుమారు 40 రోజులు కావస్తోంది. ఎన్నికల ముందు ఇచ్చిన మేనిఫెస్టోలో ఉద్యోగం కల్పించకపోతే నిరుద్యోగ భృతి ఇస్తామని వాగ్దానం చేశారు. ఇప్పుడు అది వస్తుందన్న ఆశతో ఎంతో మంది నిరుద్యోగులు ఉన్నారు. గతంలో ఇచ్చిన హామీలా కాకుండా నిజాయితీగా అమలు చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి. డిగ్రీ పూర్తి చేసి ఖాళీగా ఉన్నాను. ఉద్యోగాలు రావు. ప్రైవేట్ సెక్టార్‌లో ఉదయం నుంచి రాత్రి పొద్దు పోయే వరకు పని చేసినా ఖర్చులు పోగా ఏమీ మిగలడం లేదు. ఎటువంటి నిబంధనలు పెట్టకుండా విద్యార్హతలు, వయస్సు ప్రామాణికంగా తీసుకుని నిరుద్యోగ భృతి అందజేయాలి.
–బందారు లోకేష్‌కుమార్, నిరుద్యోగి, దిబ్బలపాలెం

నిరుద్యోగ భృతి కోసం ఎదురు చూస్తున్నాం..



కూటమి ప్రభుత్వం ఏర్పడితే ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పారు. లేకపోతే నిరుద్యోగ భృతి కల్పిస్తామన్నారు. అయితే ఎప్పటి నుంచి ఇస్తారో తెలియజేయలేదు. విధి విధానాలు కూడా వెల్లడించలేదు. మాలాంటి నిరుద్యోగులం ప్రభుత్వం అందజేసే నిరుద్యోగ భృతి కోసం వేయి కళ్లతో ఎదురు చూస్తున్నాం.
–రమేష్ డిగ్రీ విద్యార్థి, రామకృష్ణావీధి, 35వ వార్డు

విధి విధానాలు ప్రకటించాలి..



టీడీపీ ప్రభుత్వం సూపర్ సిక్స్ పేరిట ఎన్నికలకు ముందు ఇంటికో ఉద్యోగం.. లేని పక్షంలో నిరుద్యోగులకు భృతి కల్పిస్తామని వాగ్దానం చేసింది. అయితే ప్రభుత్వం ఏర్పడి దాదాపు 40 రోజులు కావస్తున్నా.. ఆ విషయంపై ఎటువంటి ప్రకటన వెలువడలేదు. ఎలా దరఖాస్తు చేసుకోవాలో.. ఎటువంటి ధ్రువపత్రాలు సమర్పించాలో కూడా తెలియటంలేదు. ఇప్పటికైనా నిరుద్యోగుల ఆశలకు అనుగుణంగా విధి విధానాలు ప్రకటించాలి.
–జోసెఫ్, బీకాం, ప్రసాద్‌గార్డెన్స్, 35వ వార్డు

క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలని నర్సుల వినతి



మంత్రి సత్యకుమార్‌కు సమస్యలు విన్నవిస్తున్న నర్సుల సంఘం నాయకులు

మహారాణిపేట: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వ నర్సుల సంఘం నాయకులు కోరారు. సోమవారం కేజీహెచ్‌కు చేరుకున్న మంత్రి సత్యకుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఏపీ నర్సుల సంఘం మాజీ అధ్యక్షురాలు బి.భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో నర్సులు మంత్రికి సమస్యలు ఏకరవు పెట్టారు.

సాయినామ సంకీర్తనా వారోత్సవాలు ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో షిర్డీ సాయిబాబా

అల్లిపురం: వెంకటేశ్వరమెట్టపై వెలసిన శ్రీ సాయి దుర్గా గణపతి ఆలయంలో సాయి నామ సంకీర్తన వారోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధి పద్మ మాట్లాడుతూ సంకీర్తన కార్యక్రమం గురుపౌర్ణమి వరకు కొనసాగుతుందని తెలిపారు. ప్రతి రోజు ఉదయం 10 నుంచి 12 గంటల వరకు సంకీర్తన జరుగుందన్నారు. గురు పౌర్ణమి రోజున బాబాకు విశిష్ట అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. భక్తులు సంకీర్తనలో పాల్గొనాలను కోరారు.

వినతుల పరిష్కారానికి చర్యలు



అర్జీలు స్వీకరిస్తున్న జెడ్సీ కృష్ణ

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్–5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి ఐదు వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ స్వీకరించి పరిశీలించారు. ప్రజా వినతులను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. టౌన్ ప్లానింగ్‌కు 02, యూసీడీకి 01, ఇంజనీరింగ్ విభాగానికి 02 చొప్పున అర్జీలు అందినట్లు జెడ్సీ తెలిపారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ ఈఈలు తారా ప్రసన్నరెడ్డి, మత్స్యరాజు, ఏసీపీ వెంకటరావు, ఆర్‌వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, వాటర్ ఏఈ మోహన్, ఏపీడీలు పద్మావతి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు సీపీఐ నాయకుల శుభాకాంక్షలు



కలెక్టర్‌ను కలిసిన సీపీఐ నాయకులు

మహారాణిపేట: కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్‌కు సోమవారం సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం. పైడిరాజు, కార్యవర్గ సభ్యులు ఎస్‌కే రెహమాన్, పి. చంద్రశేఖర్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పైడిరాజు మాట్లాడుతూ జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సీపీఐ తరఫున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. జిల్లాలో అన్యాక్రాంతం అవుతున్న విలువైన ప్రభుత్వ భూములను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేడీ నాయుడు, సీహెచ్ కాసుబాబు తదితరులు ఉన్నారు.

ప్రజా రవాణాతో కాలుష్య నిర్మూలన



ఆర్టీసీ బస్సులో జీవీఎంసీకి వస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

డాబాగార్డెన్స్: వారంలో ఒకరోజు ప్రజా రవాణా వ్యవస్థను వినియోగించడం ద్వారా కాలుష్యాన్ని అరికట్టవచ్చని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. ఆమె తన క్యాంపు కార్యాలయం నుంచి సోమవారం జీవీఎంసీకి ఆర్టీసీ బస్సులో చేరుకున్నారు. అక్కడి ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో అదనపు కమిషనర్ కేఎస్ విశ్వనాథన్‌తో కలిసి ప్రజా పరిష్కార వేదికలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్న దృష్ట్యా కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ యంత్రాంగం వారంలో ఒక రోజు ప్రజా రవాణాను వినియోగించే నిర్ణయం మేరకు జీవీఎంసీ ఉద్యోగులతో పాటు అందరం ప్రజా రవాణాను వినియోగిస్తున్నామన్నారు. ఎకో–వైజాగ్ అభివృద్ధి నేపథ్యంలో ఎకో జీరో పొల్యూషన్ కార్యక్రమంలో భాగంగా నగరంలో పర్యావరణ పరిరక్షణకు జీవీఎంసీ అనేక అవగాహన చర్యలు చేపడతుందన్నారు. కాలుష్య నియంత్రణకు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, కళాశాలల యాజమాన్యం, పరిశ్రమల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు సహకరించి వారంలో ఒకరోజు ప్రజా రవాణా వ్యవస్థ వినియోగించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రేమసమాజంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

డాబాగార్డెన్స్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు జన్మదిన వేడుకలు సోమవారం సంఘం విశాఖ జిల్లా ఆధ్వర్యంలో ప్రేమసమాజంలో నిర్వహించారు. ముందుగా ప్రేమసమాజంలో ఆశ్రయం పొందుతున్న వృద్ధులకు అన్నదానం చేశారు. అనంతరం శంకరరావు పేరిట రూపొందించిన పోస్టల్ స్టాంప్ ఆవిష్కరించారు. బీసీ హక్కుల సాధనకు అలుపెరుగని శ్రామికుడిగా, బీసీ ఉద్యమాల రథసారధిగా నిత్యం కృషి చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ని శ్రీనివాసరావు, గొర్లె శ్రీనివాసనాయుడు, పలాల రమణ, కామన వెంకట సుబ్బారావు, వై. వెంకటేశ్వరరావు, దాడి సత్యనారాయణ, శేషగిరి, లాడే కిషోర్, సురేష్, ప్రసాద్, లోగిశ గణేష్, దీప్తి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో విద్యార్థుల పాత్ర కీలకం



మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ఉపాధ్యాయులు

డాబాగార్డెన్స్: పర్యావరణ పరిరక్షణలో విద్యార్థుల పాత్ర కీలకమని హెచ్‌పీసీఎల్ జీఎం మహేష్‌రామ్ పేర్కొన్నారు. నగరంలోని ఏవీఎన్ కళాశాల హైస్కూల్లో సోమవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతో ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎంవీ భానుమతి మాట్లాడుతూ విశాఖలో పురాతనమైన తమ విద్యా సంస్థ పచ్చదనంతో నిండి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, హెచ్‌పీసీఎల్ డీజీఎం సి. మురళీకృష్ణ, చీఫ్ మేనేజర్ ఎస్‌కే ఝా, కమర్షియల్ మేనేజర్ సీతావర్ధిని, అధ్యాపక బృందం స్వరాజ్యలక్ష్మి, పైడి రజని, భవానీ, కనకమహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిరసనలతో దద్దరిల్లిన కలెక్టరేట్



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఉత్తరాంధ్ర సాధన సమితి నాయకులు

మహారాణిపేట: నిరసన కార్యక్రమాలతో సోమవారం కలెక్టర్ కార్యాలయం దద్దరిల్లింది. పలు సంఘాలు వేర్వేరు సమస్యలతో సోమవారం ఉదయం కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేస్తూ నిరసన ప్రదర్శనలు నిర్వహించారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో..

ఏఐటీయూసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు పడాల రమణ ఆధ్వర్యంలో సెంట్రల్ ఫార్మసీ మెడికల్ షాప్‌లో పనిచేస్తున్న 30 మంది సిబ్బంది అధిక పనితో ఇబ్బంది పడుతున్నామని, పని వత్తిడి తగ్గించాలని కోరుతూ ఆందోళనకు దిగారు. డ్యూటీ జాయినింగ్ సమయంలో ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకుని శ్రమ దోపిడీ చేస్తూ గత కొద్ది నెలల నుంచి జీతాలు ఇవ్వడం లేదని తెలిపారు. ఉద్యోగం మానేస్తాం సర్టిఫికెట్లు ఇవ్వాలంటే డబ్బులు కడితే గాని సర్టిఫికెట్లు ఇవ్వకుండా యాజమాన్యం ఇబ్బందికి గురి చేస్తుందన్నారు. తమ సమస్య పరిష్కరించాలని కోరుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం అందించారు.

ఉత్తరాంధ్ర సాధన సమితి ఆధ్వర్యంలో..

ఉత్తరాంధ్ర సాధన సమితి కన్వీనర్ వేమిరెడ్డి లక్ష్మున్నాయుడు ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఉత్తరాంధ్రను వెనుకబాటు నుంచి కాపాడాలని కోరారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. అలాగే అధిక జరిమానాలు విధించే జీవోలను రద్దు చేయాలని కోరుతూ ఆటో కార్మిక సంఘం ప్రతినిధులు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహక అధ్యక్షుడు డి. రమణ, ప్రధాన కార్యదర్శి సీహెచ్ కాసుబాబు, అధ్యక్షుడు ఎస్‌కే రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి

బీచ్ రోడ్డు: ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని మూడో పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ ఈశ్వరరావు సూచించారు. సోమవారం సిరిపురం సర్కిల్‌లో హెల్మెట్ ధారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ట్రిపుల్ రైడింగ్, మద్యం సేవించి వాహనం నడపడం ప్రమాదకరమని ఎస్ఐ హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించాలన్నారు. హెల్మెట్ ధరించని వాహనచోదకులకు చలానా విధించగా.. ధరించిన వారికి గులాబీ పూలు ఇచ్చి అభినందించారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.

ఇన్సూరెన్స్ రంగ సమస్యలపై ఎంపీకి వినతి



ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు

డాబాగార్డెన్స్: జీవిత బీమా (ఎల్ఐసీ) సంస్థకు సంబంధించిన సమస్యలపై విశాఖ పార్లమెంట్ సభ్యుడు భరత్‌కు ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఇన్సూరెన్స్ రంగంలో ఐపీవో పెంపు విరమించి, బీమా ప్రీమియంపై జీఎస్టీ ఎత్తివేసేలా ప్రభుత్వంతో చర్చించి, సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ఆ వినతిలో పేర్కొన్నారు. ఎంపీ స్పందిస్తూ పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో ప్రస్తావిస్తానని హామీ ఇచ్చినట్టు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో ఐసీఈయూ విశాఖ డివిజన్ జనరల్ సెక్రటరీ జి. వరప్రసాద్, ఎల్ఐసీ డబ్ల్యూడబ్ల్యూసీసీ ఏపీ స్టేట్ కన్వీనర్ జి. సూర్యప్రభ, నాయకులు సతీష్, గోవింద్, శ్రీనివాసరావు, ఏవీఆర్‌కే మూర్తి తదితరులు ఉన్నారు.

అక్రమ నిర్మాణంపై చర్యలకు వినతి



ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న యుగంధర్

మహారాణిపేట: గాజువాక మెయిన్‌రోడ్డు నుంచి గాంధీనగర్ మీదుగా జోగవానిపాలెం వెళ్లే 30 అడుగుల రోడ్డులో అనధికార భవన నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని ప్రజా హక్కుల పోరాట సమితి గాజువాక అధ్యక్షుడు, బీసీ సంఘ ప్రతినిధి పి.యుగంధర్ కోరారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆ తర్వాత ఆర్డీవో హుస్సేన్ సాహెబ్‌ను కలిసి భవన యజమాని నకిలీ సర్వే నంబర్‌తో అనుమతులు తీసుకొని రహదారిని ఆక్రమించారని వివరించారు. ఈ ఆక్రమ నిర్మాణం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, గాజువాకలోని వివిధ శాఖల అధికారులు అతనికి అండగా ఉన్నారని యుగంధర్ ఆరోపించారు.

సన్యాసయ్యకు పలువురి నివాళి



సన్యాసయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మేయర్ హరివెంకటకుమారి తదితరులు

డాబాగార్డెన్స్: స్వాతంత్య్ర సమరయోధుడు, సంఘ సేవకుడు కంటి మహంతి సన్యాసయ్య అనునిత్యం సమాజ సేవకు పరితపించేవారని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి కొనియాడారు. ఆయన 125వ జయంతి సోమవారం నగరంలోని రామకృష్ణా జంక్షన్ 75 అడుగుల రోడ్డులో గల ఆయన కుమారుడు రామచంద్రమూర్తి ఇంటి వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాల్గొన్న మేయర్ మాట్లాడుతూ సన్యాసయ్య రెవెన్యూ శాఖలో ఉద్యోగం చేస్తూ, సమాజ సేవ కోసం ఎంతో పాటుపడే వారని తెలిపారు. ఏపీ భానోజీరావు, తెన్నేటి విశ్వనాథం వంటి ప్రముఖులతో సంబంధాలున్నాయని, క్విట్ ఇండియా, ఉప్పు సత్యాగ్రహం వంటి ఉద్యమాల్లో పాల్గొని పాలకులను ఎండగట్టే వారని తెలిపారు. కార్యక్రమంలో కంటిమహంతి రామచంద్రమూర్తి, డి. ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, జేటీ రామారావు, సన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

నడిరోడ్డుపై పడిపోయిన మహిళకు సపర్యలు



రోడ్డుపై పడి ఉన్న మహిళను పరిశీలిస్తున్న పచ్చిరిపల్లి రాము తదితరులు



మహిళను ఆస్పత్రికి తరలిస్తున్న రాము, యువకులు

అల్లిపురం: నడిరోడ్డుపై పడిపోయిన మహిళకు 33వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు పచ్చిరిపల్లి రాము కొంత మందితో కలిసి సపర్యలు చేసి ఆస్పత్రికి తరలించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం అల్లిపురం వీధుల్లో ఒక మతి స్థిమితం లేని మహిళ తిరుగుతుంటుంది. ఆమె ఒక అపార్ట్‌మెంట్ ముందు నడిరోడ్డుపై స్పృహ కోల్పోయి పడిపోయింది. ఆ దారి గుండా వెళ్తున్న వారు చూస్తూ వెళ్లిపోయారు తప్ప ఎవరు పట్టించుకోలేదు. అదే సమయంలో అటుగా వెళ్తున్న పచ్చిరిపల్లి రాము ఆమెను చూసి కొంత మంది స్థానిక యువకులతో ఆమెకు సపర్యలు చేసి 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి



జీవీఎంసీ రోడ్డులో ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

సీతమ్మధార: ఆటో డ్రైవర్ల ఉపాధికి గండి కొట్టే ఓలా, ఉబర్, ర్యాపిడో సర్వీసులను రద్దు చేయాలని, టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెల రోజులు కాక ముందే ఆటోలపై ఆర్‌టీఏ, పోలీసులు పెడుతున్న అక్రమ కేసులు ఎత్తివేయాలని విశాఖ జిల్లా ఆటో రిక్షా కార్మిక సంఘం (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ రెహమాన్, సీహెచ్ కాసుబాబు మాట్లాడుతూ విశాఖ జిల్లాలో అనేక ప్రాంతాల్లో ఆటో స్టాండ్‌లు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నామన్నారు. ఓలా, ఉబర్, ర్యాపిడో సర్వీసులు ఏర్పాటు చేసినప్పటి నుంచి తమ ఆదాయానికి గండి పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఆర్‌టీఏ, పోలీసులు ఆటోలపై కేసులు పెడుతూ అధిక జరిమానాలు విధిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకుని వెంటనే ఇటువంటి చర్యలకు స్వస్తి పలికాలని డిమాండ్ చేస్తూ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజే అచ్యుతరావు, అధ్యక్షుడు మన్మథరావు, పోల్‌రెడ్డి, సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీమిండియా మరిన్ని విజయాలు సాధించాలి

డాబాగార్డెన్స్: టీమిండియా టీ–20 వరల్డ్‌కప్ గెలుచుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని 29వ వార్డులో ఎస్‌డీవైసీసీ క్రికెట్ క్లబ్ సీనియర్స్ అండ్ జూనియర్స్ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న జనసేన పార్టీ నాయకుడు మన్యాల శ్రీనివాస్ మాట్లాడుతూ టీమిండియా భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని అభిలషించారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల యువతలో క్రీడా స్ఫూర్తి, దేశభక్తి అలవడటమే కాక, యువత క్రీడల్లో పాల్గొనేందుకు ఉత్సాహం చూపుతుందని నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌డీవైసీసీ క్రికెట్ క్లబ్ సీనియర్స్ అండ్ జూనియర్స్ సభ్యులు, శ్రీరంగపురం స్థానికులు పాల్గొన్నారు.